## 6. దేవుడుండి ఏం లాభం?

ఓ ఆధ్యాత్మికవేత్త తన నాస్తిక మిత్రుడితో కలిసి వాకింగ్‌కి వెళ్ళాడు. దారిలో కనబడ్డ పూరి గుడిసెల్లోని, తాగుడుకి అలవాటుపడి వ్యభిచారంచేసి సంపాదించే బీదవాళ్ళని, రోగులని చూసి నాస్తికుడు తన మిత్రుడితో చెప్పాడు.

"ప్రపంచంలోని దుఃఖాన్ని చూసావా? వేలకొద్దీ సంవత్సరాలనించి, మీ ఆధ్యాత్మికవేత్తలు దేవుడి గురించి ఎంత బోధించినా ప్రపంచంలోని పేదరికం పోయి, శాంతి, ప్రేమ, మంచితనాలు రాలేదు. దేవుడున్నాడన్నది అనుమానమే. ఉన్నా ఏం లాభం?"

ఆధ్యాత్మిక మిత్రుడు బదులేం చెప్పలేదు. కొద్ది దూరం వెళ్ళాక ఒంటికి అంటిన బురదతో మురిగ్గా వున్న ఓ పిల్లని చూపించి చెప్పాడు ఆధ్యాత్మికుడు.

"ప్రపంచంలో ఎన్ని కోట్ల సబ్బులని తయారీదారులు ఉత్పత్తి చేసి ఏం లాభం? ఆ పిల్ల ఎంత మురికిగా ఉందో చూడు. అసలు సబ్బు మురికిని వదలకొట్టగలదన్నది నాకు అనుమానమే."

"అలా అనక. సబ్బుని ఆ పిల్ల ఉపయోగించి వుంటే, ఆ మురికంతా వదిలేది." అభ్యంతరం చెప్పాడు నాస్తిక మిత్రుడు.

"దేవుడి విషయంలో కూడా సరిగ్గా అంతే." చిరునవ్వుతో చెప్పాడు ఆధ్యాత్మికుడు.

## 7. అహం

నైమిశారణ్యంలో ఓ టేకు చెట్టు, ఓ గంధపు చెట్టు పక్కపక్కనే వున్నాయి. ఓరోజు టేకు చెట్టు గంధపు చెట్టుతో చెప్పింది.

"నీకన్నా నేనే గొప్పదాన్నని నీకు తెలుసా? నిన్ను నీళ్ళల్లో అరగతీస్తే సుకుమారివి కాబట్టి అరిగిపోతావు. నేను అలా అరగని బలిష్టమైనదాన్ని."